క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

గద్వాల అర్బన్: జిల్లాలోని నిరుద్యోగులకు కర్నూల్, గద్వాలలోని వివిధ కంపెనీల్లో శిక్షణ, ఉపాధి కల్పించేందుకు శుక్రవారం ఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ నందు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారిణి ప్రియాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హత కల్గి 18–35 ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కూరగాయల మార్కెట్‌లో అపరిశుభ్రత

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్ పరిసరాల్లో దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు పట్టించుకోవడం లేదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్‌ను ఆయన సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, ఖాజా, కార్తీక్, ఆంజనేయులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల



గద్వాల అర్బన్: ఈనెల 28న మిలాద్ ఉన్ నబీ వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని ఒంటలపేట మస్జీద్ ఏ అన్వర్‌లో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా విడుదల చేశారు. ఈనెల 27న రాత్రి 9గంటలకు మస్జీద్ ఏ అన్వర్‌లో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ప్రారంభం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు షఫీఉల్లా, రఫీ, ఫారుక్ పాషా, జాకీర్, ఇలియాస్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు చెల్లించాలి

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీ నిర్వాహకులకు చెల్లించాల్సిన మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు డిమాండ్ చేశారు. బుధవారం గట్టులోని ఎంఈఓ కార్యాలయం ఎదుట వివిధ గ్రామాలకు చెందిన వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన నిర్వహించారు. జిల్లాలో వంట ఏజెన్సీ కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు విడుదల అయ్యాయని, వాటిని కార్మికుల ఖాతాలో మాత్రం జమ చేయడం లేదని వంట కార్మికుల జిల్లా అధ్యక్షుడు శేషన్న ఆరోపించారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

20 రోజులుగా అంగన్‌వాడీ సెంటర్ మూసివేత

మానవపాడు: మండలంలోని మద్దూరులో అంగన్‌వాడీ సెంటర్ 1ను గత 20 రోజులుగా మూసివేశారని గ్రామస్తులు ఆరోపించారు. బుధవారం సీడీపీఓ సుజాత అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసింది. సెంటర్ 1కు సంబంధించిన గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందడం లేదని వాపోయారు. దీనిపై అంగన్‌వాడీ టీచర్ ఆస్మాను వివరణ కోరగా, సెంటర్ 1కు సంబంధించిన పోషకాహారం అంగన్‌వాడీ 2లో అందించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తిని బైక్‌తో ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ కథనం ప్రకారం.. ఎర్రవల్లి గ్రామానికి చెందిన బండి భాస్కర్ బిక్షాటన చేస్తుండేవాడు. ఈ నెల 17న బిక్షాటన కోసం పుటాన్‌దొడ్డికి వెళ్లి తిరిగి వస్తుండగా కోదండాపూర్, ఎర్రవల్లి మధ్య జాతీయ రహదారిపై చాగాపురం గ్రామానికి చెందిన బోయ నరేష్ ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో భాస్కర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు బోయ నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రెయినేజీ అస్తవ్యస్తం!

- పెరుగుతున్న దోమలు, పందుల స్వైరవిహారం
- వ్యాధులు బారిన ప్రజలు, పట్టించుకోని అధికారులు



మానవపాడులో రోడ్డు పక్కనే నిలువ ఉన్న మురుగు

మానవపాడు: మండలంలోని గ్రామాల్లో మురుగు కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. మురుగు కాల్వల్లో పూడిక నిండడంతో కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని గ్రామాల్లో డ్రెయినేజీలు లేక నీరంతా రోడ్లపై పారుతోంది. కాల్వల్లో పూడిక నిండి పిచ్చి మొక్కలు పెరిగాయి. దీనికి తోడు మురుగు గుంతల్లో పందుల స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పర్యవేక్షణ చేయాలి..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది. గ్రామాల అభివృద్ధి పనులు, మురుగు కాల్వల పరిస్థితిని గమనించాలి. మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాల్వలు శుభ్రం చేయాలి..



ఇండ్ల నుంచి వచ్చే మురుగు కాల్వలు ప్రతిరోజు శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగి వైరల్ ఫీవర్ వల్ల చిన్నారులు, పెద్దలు ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్ల చుట్టూ మురుగు వ్యాప్తి చెందుతోంది. చాలా రోజుల నుంచి అధికారులకు, పాలకులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మురుగుకాల్వలను శుభ్రం చేయాలి.

– రవికుమార్, చెన్నిపాడు

డ్రెయినేజీలు లేక అవస్థలు..



బోరవెల్లిలో డ్రెయినేజీ కాల్వలు లేవు. దీంతో నీరు రోడ్డు మీద పారుతోంది. గ్రామంలో అండర్ డ్రెయినేజీ నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి. చాలా సార్లు అధికారులకు, పాలకులకు చెప్పినా ఫలితం శూన్యం. అధికారులు చొరవ తీసుకొని అండర్ డ్రెయినేజీ నిర్మించాలి.

– మౌలాలి, బోరవెల్లి

నివారణ చర్యలు తీసుకుంటాం..

మండలంలోని మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పాం. మురుగు కాల్వలను తీయించి, చెత్తాచెదారం తొలగిస్తాం. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లి వాటి నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే అభివృద్ధి కనిపిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు కళ్ల ముందున్నాయని, వాటి ద్వారానే ముందుకెళ్తామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్లో ఎంపీపీ నజీమున్నీసా బేగం అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అనేక పనులు చేశామన్నారు. గత ప్రభుత్వాల 75ఏళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేసి చూపించామన్నారు. అనంతరం సఖి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, 1098 సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ ఎండీ జబ్బార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పరమేష్, పీఆర్ ఏఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గట్టు: మండల కేంద్రానికి చెందిన సరాబ్బాయి చిన్న తిమ్మప్ప అలియాస్ టిక్కలన్న(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గట్టు–1 ఎంపీటీసీ సభ్యురాలు మహేశ్వరి మామ, గట్టు–2 ఎంపీటీసీ సభ్యుడు కృష్ణ అన్న సరాబ్బాయి చిన్న తిమ్మప్ప గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలి



విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర ఆందోళన నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

గట్టు: పేద కుటుంబాలకు ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను 101 యూనిట్ల నుంచి 300 యూనిట్లకు పెంచాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గట్టు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న మాట్లాడుతూ కేరళ, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల్లో దళితులకు 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 101 యూనిట్లను మాత్రమే ఉచితంగా అందజేస్తున్నారని, ఇక్కడ కూడా 300 యూనిట్లను ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల ప్రధాన కార్యదర్శి కర్రెప్ప, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బద్రి, బజారన్న పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



నూతన విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ డా.అరుణాబాయి

శాంతినగర్: విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని ప్రణాళికను రూపొందించుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణాబాయి అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల 2023–24 విద్యార్థుల ఫ్రెషర్స్ డే బుధవారం నిర్వహించారు. కళాశాలకు వచ్చే నూతనంగా విద్యార్థులకు అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సంపాదించాలన్నారు. తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తేవాలని సూచించారు. కామర్స్ విభాగంలో వ్యాపార గణాంక శాస్త్రంలో పాలమూరు విశ్వవిద్యాలయంలో 10/10 జీపీఏ సాధించిన మాధవిని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డా.చంద్రమోహన్, డా.శివనారాయణ, డా.ఏడుకొండలు, విష్ణుమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేష్, రాఘవేంద్ర, జీవ జయరాజు, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తహీనతను దూరం చేద్దాం

గట్టు: సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్తహీనతను దూరం చేయొచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి తెలిపారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం బల్గెర అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. ఆలూరు 4వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ ఇందిర గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బల్గెర అంగన్‌వాడీ టీచర్ అలివేలు, శోభ, కవిత, సుజాత, జయలక్ష్మి, కార్యదర్శి, ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం ఆశా కార్యకర్తలు నిరవధిక సమ్మెను చేపట్టారు. ఆశా కార్యకర్తలకు రూ.18వేల జీతం ఇవ్వడంతో పాటు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు సరస్వతి, రాజేశ్వరి, సుగుణ, సుజాత, నర్సమ్మ ఉన్నారు.

పురుగు మందుల పిచికారీపై జాగ్రత్తలు

మానవపాడు: మండలంలోని బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల్లో వానకాలం 2023 సీజన్‌కు సంబంధించి డివిజన్ సహాయ సంచాలకులు సక్రీయనాయక్ బుధవారం వివిధ రకాల పంటలను పరిశీలించారు. మిరప, పత్తి, ఉల్లి, తదితర పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మందును పిచికారీ చేసేటప్పుడు రైతుల హెల్మెంట్‌ను, మాస్క్‌ను తప్పక వాడాలని సూచించారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల క్లస్టర్‌లోని తక్కశిల, ఖానాపూర్, ఇటిక్యాలపాడు శివారులోని పత్తి పంటలను ఏడీఏ సక్రీయ నాయక్ పరిశీలించారు. ఎరువుల ఉపయోగంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అదిల్, రైతులు పాల్గొన్నారు.

పరామర్శించిన ఏఐసీసీ కార్యదర్శి

శాంతినగర్: కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంకల మహేశ్వర్‌రెడ్డిని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ బుధవారం పరామర్శించారు. మహేశ్వర్‌రెడ్డి ఇటీవల కంటికి సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్నారని, ఈ విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి కొంకలలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం గ్రామంలో వినాయకున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎనుముల నాగరాజు, జగన్‌గౌడ్, వేణురెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్టారెడ్డిలు ఉన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

- ఆర్డీఓ చంద్రకళ



అలంపూర్ చౌరస్తాలో రాజకీయ పార్టీలతో ఆర్డీఓ సమావేశం

అలంపూర్: రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాకు సహకరించాలని గద్వాల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి గద్వాల ఆర్డీఓ చంద్రకళ, నియోజకవర్గంలోని తహసీల్దార్‌లు, ఎన్నికల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. జూలై 16వ తేదీ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ఓటర్ల జాబితా సవరణ చేపట్టినట్లు తెలిపారు. బూత్ స్థాయిలో ఓటర్ల ప్రక్రియ జరిగినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలోని మార్పులకు సంబంధించి రాజకీయ పార్టీలు క్షేత్ర స్థాయిలో సహకరించాలన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల మౌన ప్రదర్శన



గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు తమ ఆందోళన తీవ్రతరం చేశారు. ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. బుధవారం ఉద్యోగులు నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని మౌన ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతబట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనకు తరలి వచ్చారు. అనంతరం గాంధీ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళనకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, విశ్రాంత ఎంఈఓలతో పాటు పలు సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సంఘాల నాయకులు బీచుపల్లి, త్యాగరాజు మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోపాల్, హుస్సేన్, జనార్దన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామంజనేయులు, యువరాజు, నర్సింహా పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



కేటీదొడ్డిలోని నిరాహార దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కేటీదొడ్డి: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా కో– కన్వీనర్ బండారి డేవిడ్, మండల అధ్యక్షుడు జంబయ్య ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని రోడ్డుపై ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు మాశప్ప, నర్సింహ, రాజ్, కిరణ్, విష్ణు, నర్సింహులు, హన్మేష్, నందు, నర్సింహులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలి..

గద్వాల అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో మన్యం, రంజిత్, తిమ్మన్న తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



కొండేరులో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: పేదల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి, కొండేరు గ్రామాల్లో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 3,75,500 చెక్కులను 7మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహేశ్వరెడ్డి, కృష్ణసాగర్, జయచంద్రారెడ్డి, ఈరన్న, నీలి శ్రీనివాసులు, రాఘున్న, శివుడు, మధునాయుడు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జల్లాపురం వెంకటేశ్వర్లుకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును ఇంటికెళ్లి ఎమ్మెల్యే వీఎం అబ్రహం అందజేశారు.

మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం

గట్టు: గట్టులో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. బుధవారం బస్టాండ్ ఆవరణలో మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ, బిల్లును పార్లమెంట్ నూతన భవనంలో ప్రవేశ పెట్టి ఆమోదించిన తరుణంలో ప్రధాని నరేంద్రమోడీ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుసూదన్‌రావు, సంధ్యనర్సన్‌గౌడు, కొళాయి భాస్కర్, రాజప్ప, రమేష్, తిమ్మప్ప, వెంకట్రాములు, బెల్లం నర్సింహులు, లక్ష్మన్న, మంజుల, కవిత, ఉలిగమ్మ, ఆంజనేయులు, భీమేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గద్వాల: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు సంబురాలు నిర్వహించారు. బుధవారం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి మాట్లాడారు. పాతికేళ్లుగా ఆమోదానికి నోచని మహిళా రిజర్వేషన్ బిల్లు ఎట్టకేలకు మోదీ నేతృత్వంలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, జయశ్రీ, అనిత, భారతి పాల్గొన్నారు.

ఘనంగా గణనాథులకు పూజలు



సద్దలోనిపల్లిలో పూజలందుకుంటున్న గణనాథుడు



అయిజలో నిమజ్జన ఊరేగింపులో నృత్యం చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి, ఎల్కూరు, తాటికుంట, మల్దకల్, అమరవాయి, కుర్తిరావల్‌చెర్వు, మద్దెలబండ గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులకు బుధవారం ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గణపయ్య నిమజ్జనం..

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో బుధవారం వినాయకుడి విగ్రహాలను భక్తులు ఘనంగా ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పూజలో పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం..

ధరూరు: వినాయక చవితిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుల మండపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. బీరప్ప ఆలయం వద్ద దాత ప్రదీప్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం చేయగా, కాలికాదేవి ఆలయం, చాకలి వీధిలోని వినాయక మండపాల వద్ద దాత చాకలి వెంకటేష్ అన్నదానం ఏర్పాటు చేశారు.

గద్వాల: వినాయకుని మండపాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని సన్నిధిలో అన్నదానం ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు డీకే స్నిగ్ధారెడ్డితో పాటు పలువురు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పూజలు చేశారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో చిన్నారులు కోలాటం, భక్తి గీతాలకు నృత్యాలు చేశారు.